ఉచిత శిక్షణ.. ఉపాధి కల్పన

- స్కిల్ హబ్ ద్వారా వివిధ కోర్సుల్లో తర్ఫీదు
- ఉపాధి పొందుతున్న యువత


స్కిల్ హబ్ ద్వారా కంప్యూటర్ శిక్షణ


శిక్షణను పరిశీలిస్తున్న ఏపీఎస్ఎస్‌డీసీ ఎండీ అండ్ సీఈవో డాక్టర్ వినోద్‌కుమార్

పెదగంట్యాడ: యువతకు ఉపాధి కల్పించాలి.. వారికి ఉజ్వల భవిష్యత్తును అందించాలి.. వారి జీవితం బంగారుమయం కావాలనే దృఢ సంకల్పంతో ఆంధ్రప్రదేశ్ స్టేట్ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఏపీఎస్ఎస్‌డీసీ) విశేష కృషి చేస్తోంది.. ఇందులో భాగంగా పెదగంట్యాడలోని


వెల్డింగ్‌లో శిక్షణ

ప్రభుత్వ పారిశ్రామిక శిక్షణ సంస్థలో 2022 అక్టోబర్ 22న స్కిల్ హబ్‌ను అట్టహాసంగా ప్రారంభించారు. ఈ శిక్షణ కోసం వచ్చే యువతకు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించడంతో పాటు వారికి ఆసక్తి ఉన్న కోర్సుల్లో విరివిగా శిక్షణ ఇస్తున్నారు. ఆయా కోర్సుల్లో వారికి నిష్ణాతులతో తర్ఫీదు ఇస్తున్నారు.

ఇవీ సదుపాయాలు..

విద్యార్థినీ విద్యార్థుల కోసం ఏపీఎస్ఎస్‌డీసీ ద్వారా టేబుళ్లు, కుర్చీలు, వాటర్ డిస్పెన్సర్, సీసీ కెమెరాలు, ఇంటర్నెట్ సదుపాయం సమకూర్చారు. అలాగే కంప్యూటర్ శిక్షణ కోసం ల్యాప్‌టాప్‌లను సైతం అందజేశారు.

స్కిల్ హబ్ ద్వారా నిర్వహించిన కోర్సులు..

మెయింటెనెన్స్ ఫిట్టర్ కోర్సులో 30 మందికి శిక్షణ ఇచ్చారు. శిక్షణ పొందిన వారికి జాన్సన్ లిఫ్ట్స్, సిన ర్జీస్‌లో ఉపాధి కల్పించారు. అలాగే లైట్ మోటార్


ఫిట్టర్ శిక్షణలో యువత

వెహికల్ డ్రై వింగ్‌లో 15 మందికి శిక్షణ ఇవ్వగా వారంతా ఇప్పుడు సొంతంగా డ్రై వింగ్ చేసుకుంటూ ఉపాధి పొందుతున్నారు.

పీఎంకేవీవై 4.0 ద్వారా నిర్వహించిన కోర్సులు

అసోసియేట్ డేటా ఎంట్రీ ఆపరేటర్ కోర్సుల్లో మొత్తం 21 మందికి శిక్షణ కల్పించారు. ఫోర్ వీలర్ సర్వీస్ టెక్నీషియన్ కోర్సులో 9 మందికి, అసిస్టెంట్ ఎలక్ట్రీషియన్ కోర్సులో 22 మందికి, ఆఫీస్ అసిస్టెంట్ కోర్సులో 30 మందికి శిక్షణ ఇచ్చారు. పై కోర్సులు నిర్వహించేందుకు గానూ ఆంధ్రప్రదేశ్ స్టేట్ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ వారు మూడు విడతలుగా మొత్తం రూ.7,70,232 నిధులను మంజూరు చేశారు. ప్రస్తుతం ఆఫీస్ అసిస్టెంట్ కోర్సులో 30 మంది ఉండగా, వెల్డర్ కోర్సులో 30 మంది శిక్షణ పొందుతున్నారు. ఈ సందర్భంగా ఐటీఐ ప్రిన్సిపాల్ కేఎస్ శ్రీనివాసరావు మాట్లాడుతూ నైపుణ్యంతో కూడిన శిక్షణను ఎక్కువ మందికి అందించాలనే లక్ష్యంతో పని చేస్తున్నామని చెప్పారు. ఉపాధి అవకాశాలను అందించే ఈ కోర్సులను యువత సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

డ్రైవింగ్‌లో శిక్షణ పొందా



మాది పెదగంట్యాడ మండలం చిన పాలెం గ్రామం.. చిన్నప్పటి నుంచి డ్రైవింగ్ చేయాలని ఆసక్తి ఉండేది. స్కిల్ హబ్ ద్వారా 45 రోజుల పాటు శిక్షణ ఇచ్చారు. డ్రైవింగ్‌లో మెలకువలను సులభంగా నేర్పించారు. గతంలో స్కూటీ నడపడానికి కూడా భయపడేదాన్ని.. కానీ ఇప్పుడు అవలీలగా కారు డ్రైవ్ చేస్తున్నాను. ఈ శిక్షణతో సొంతంగా ట్యాక్సీ నడుపుకుంటూ నా కాళ్ల మీద నేను నిలబడతా.

–నజియా పర్వీన్, చినపాలెం, పెదగంట్యాడ

ఆఫీస్ అసిస్టెంట్‌గా..



మాది కూర్మన్నపాలెం.. ఐటీఐలో ఎలక్ట్రానిక్స్ పూర్తి చేశాను. ఆపై ఇప్పుడు ఆఫీస్ అసిస్టెంట్‌గా మూడు నెలల పాటు శిక్షణ పొందాను. ఎంఎస్ ఆఫీస్‌లో శిక్షణ ఇచ్చారు. ఇప్పుడు నేను ఏదైనా కార్యాలయంలో రిసెప్షనిస్ట్‌గా గానీ, టైపిస్ట్‌గా గానీ పని చేయగలను. పరీక్షలు కూడా పూర్తయ్యాయి. సర్టిఫికెట్ వచ్చిన తర్వాత ఉద్యోగ ప్రయత్నాలు చేస్తాను.

–మర్తి నిహారిక, కూర్మన్నపాలెం, గాజువాక

అసిస్టెంట్ ఎలక్ట్రీషియన్‌గా..



మాది చినగంట్యాడ, పదో తరగతి పూర్తి చేసి డిప్లొమో చేశాను. తర్వాత నాకు ఆసక్తి ఉన్న రంగంలో రాణించాలని అనుకున్నాను. నేను చిన్నప్పటి నుంచి ఎలక్ట్రీషియన్ అవ్వాలనేది కోరిక. స్కిల్ హబ్ ద్వారా అసిస్టెంట్‌గా మూడు నెలల పాటు శిక్షణ పొందాను. శిక్షణ పూర్తి చేసుకున్న తర్వాత నేను డాక్‌యార్డ్‌లో పని చేస్తున్నాను. ఈ శిక్షణ నాకు ఎంతగానో ఉపయోగపడింది.

–పాల నాగ వెంకట హేమంత్ కుమార్, చినగంట్యాడ, గాజువాక

క్లుప్తంగా

నేడు కణితి రోడ్‌లో విద్యుత్ లైన్ల మార్పు

గాజువాక: కణితి రోడ్డు విస్తరణ పనుల్లో భాగంగా వంటిల్లు జంక్షన్ నుంచి కొత్త గాజువాక జంక్షన్ వరకు విద్యుత్ లైన్లను మంగళవారం మార్చనున్నట్టు ఏపీఈపీడీసీఎల్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ బి.కె.నాయుడు తెలిపారు. ఈ కారణంగా సనత్‌నగర్, వందడుగుల రోడ్ శివాలయం ఏరియా, సింహగిరి కాలనీ, కణితి రోడ్, అజీమాబాద్, నవాబ్‌నగర్, కైలాస్‌నగర్, 60 అడుగుల రోడ్ ప్రాంతాల్లో ఉదయం తొమ్మిది నుంచి మధ్యాహ్నం మూడు గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని తెలిపారు.

బీఎంఎస్ రాష్ట్ర నూతన కార్యవర్గం

అక్కిరెడ్డిపాలెం: భారతీయ మజ్దూర్ సంఘ్ (బీఎంఎస్) రాష్ట్ర నూతన కార్యవర్గాన్ని సోమవారం షీలానగర్‌లో బీవీకే స్కూల్‌లో ఎన్నుకున్నారు. రాష్ట్ర అధ్యక్షుడిగా టి.రఘురాం, కార్యనిర్వాహక అధ్యక్షుడిగా కోదండరాం, ప్రధాన కార్యదర్శిగా మోటూరు వెంకట సన్యాసినాయుడు, కార్యదర్శులుగా లోవరెడ్డి, బొజ్జ రమేష్, కోశాధికారిగా లాలం ప్రసాద్‌లు ఎన్నికైనట్లు జిల్లా కార్యదర్శులుగా శరగడం చంద్రశేఖర్, రొక్కం సురేష్, జోనల్ కార్యదర్శిగా రాందాస్ నరేంద్రలు తెలిపారు.

విశాఖ ఉక్కు జోలికి వస్తే చరిత్ర హీనులవుతారు


1,110వ రోజు దీక్షలో పాల్గొన్న ఉక్కు పోరాట కమిటీ నాయకులు

కూర్మన్నపాలెం: విశాఖ ఉక్కు పరిశ్రమను ప్రైవేటీకరణ చేస్తే చూస్తూ ఊరుకోబోమని, విశాఖ ఉక్కు జోలికి వస్తే చరిత్ర హీనులవుతారని ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు హెచ్చరించారు. కూర్మన్నపాలెం కూడలిలోని స్టీల్‌ప్లాంట్ ఆర్చి వద్ద జరుగుతున్న రిలే నిరాహార దీక్ష సోమవారం నాటికి 1110వ రోజుకు చేరుకున్నాయి. సంస్థకు చెందిన పలు విభాగాల కార్మికులు పాల్గొని కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. కార్యక్రమంలో ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు, ఇతర కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

ఉక్కు హార్టికల్చర్ సొసైటీలను బలోపేతం చేయాలి


ఉక్కు ఎస్డీసీ సునీతను సత్కరిస్తున్న నిర్వాసిత సంఘ నాయకులు

అగనంపూడి: విశాఖ స్టీల్‌ప్లాంట్ సారథ్యంలో నిర్వహిస్తున్న హార్టికల్చర్ సొసైటీలను బలోపేతం చేయాలని స్టీల్‌ప్లాంట్ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ సునీతను నిర్వాసిత సంఘాల నాయకులు కోరారు. ఉక్కు భూసేకరణ విభాగం నూతన ఎస్డీసీగా బాధ్యతలు చేపట్టిన సునీతను ఘనంగా సత్కరించిన నాయకులు నిర్వాసితుల సమస్యలపై వినతిపత్రం అందించారు. గతంలో స్టీల్‌ప్లాంట్‌లో పర్మినెంట్ పద్ధతిలో ఒప్పంద కార్మికులను నియమించారని, నాలుగేళ్లలో నియామకాలు చేపట్టకపోవడం వల్ల నిర్వాసిత నిరుద్యోగులు తీవ్ర నిరాశతో ఉన్నారని నాయకులు నెల్లి శ్రీనివాసరావు, బలిరెడ్డి సత్యనారాయణలు ఎస్డీసీ దృష్టికి తీసుకువెళ్లారు.

6న మహిళా దినోత్సవ వేడుకలు

విశాఖ విద్య: జీవీఎంసీ 90వ వార్డు బుచ్చిరాజుపాలెం ఏపీఎస్ఈబీ కాలనీలోని షిర్డీ సాయిబాబా మందిరంలో మహిళా దినోత్సవం పురస్కరించుకొని మార్చి 6న ప్రత్యేక వేడుకలను నిర్వహించనున్నట్టు కమిటీ అధ్యక్షుడు విళ్లా సత్యనారాయణ తెలిపారు. ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు మహిళల కోసం ప్రత్యేక కార్యక్రమాలు ఉంటాయన్నారు. పరిసర కాలనీలకు చెందిన మహిళలు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు. వివరాలకు గీత సెల్–891350 5385 నంబర్‌లో సంప్రదించాలన్నారు.

జగన్ పాలనలో రాష్ట్రం సుభిక్షం

- వైఎస్సార్‌సీపీ గాజువాక సమన్వయకర్త చందు
- రెండో రోజుకు చేరుకున్న పాదయాత్ర
- అడుగడుగునా హారతులతో స్వాగతం పలికిన మహిళలు


పాదయాత్రలో ఉరుకూటి రామచంద్రరావుకు హారతుల పడుతున్న మహిళలు


మాజీ మంత్రి స్వర్గీయ గురునాథరావు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న చందు

అక్కిరెడ్డిపాలెం: జీవీఎంసీ 68వ వార్డులో గాజువాక వైఎస్సార్ సీపీ సమన్వయకర్త ఉరుకూటి రామచంద్రావు (చందు) పాదయాత్రను రెండో రోజు మిందిలో నిర్వహించారు. సోమవారం పాదయాత్ర ప్రారంభానికి ముందు రాష్ట పరిశ్రమలు, ఐటీ శాఖా మంత్రి గుడివాడ ఆమర్‌నాథ్ నివాసంలో మాజీ మంత్రి స్వర్గీయ గుడివాడ గురునాథరావు చిత్రపటం వద్ద నివాళులర్పించారు. మంత్రి అమర్‌నాథ్ తల్లి గుడివాడ నాగమణి ఆశీర్వాదం తీసుకున్నారు. మంత్రి సతీమణి హిమబిందు శుభాకాంక్షలు తెలిపారు. వార్డు కార్పొరేటర్ గుడివాడ అనూష, వార్డు వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జ్ గుడివాడ లతీష్‌లతో కలిసి గ్రామంలో పాదయాత్రను ప్రారంభించారు. అడుగడుగునా గ్రామంలోని మహిళలు హారతులు పట్టారు. పలువురు చందును ఆశీర్వదించారు. ఉరుకూటి చందు మాట్లాడుతూ చంద్రబాబుకు ఎందుకు ఓటు వేయాలని ప్రశ్నించారు. గెలవడమే లక్ష్యంగా అధికారం కోసం పాకులాడుతూ, రాష్ట్రాన్ని దోచుకుతినడానికి పవన్‌కల్యాణ్‌తో చంద్రబాబు పొత్తుల డ్రామాలను ప్రజలు గమనిస్తున్నారన్నారు. ఒక వైపు జగన్‌మోహన్ రెడ్డి పాలనలో ప్రజలు ఆనందంగా ఉన్నారన్నారన్నారు. పేదల జీవితాల్లో వెలుగులు నింపారన్నారు. విద్యా, వైద్యం, అభివృద్ధి, సంక్షేమాలకు అధిక ప్రాధానత్య కల్పిస్తూ ఇంటి వద్దకే సంక్షేమ పథకాలు అందిస్తూ అవినీతికి చోటులేని పరిపాలన సాగిస్తున్నారని వివరించారు. తిరిగి జగన్‌మోహన్ రెడ్డిని ముఖ్యమంత్రిని చేసుకుంటే రాష్ట్రం సుభిక్షంగా ఉంటుందని అన్నారు. కార్యక్రమంలో ఈటి సురేష్, రెడ్డిపల్లి చిట్టిబాబు, రొక్కం వెంకటరావు, వరదాడ వెంకటరమణ, సంధ్రాన నూకరాజు, నంబారు రాజు, ఎస్సీ, ఎస్టీ మోనటరింగ్ కమిటీ మెంబర్ కటికల కల్పన, పోలవరపు శ్రీహరి, ఈటి శ్యామలరావు, డీఎన్నార్ రమణ, తిరుపతి ప్రసాద్, గొంతిన సత్యవతి, రెడ్డిపల్లి శ్రీను, పట్నాల కృష్ణ, పూజారి రాజు, గుడివాడ ప్రసాద్, అమ్మాజి తదితరులు పాల్గొన్నారు.

మౌలిక వసతుల కల్పనే తొలి ప్రాధాన్యం


శంకుస్థాపనలో పాల్గొన్న మేయర్ హరి వెంకట కుమారి, ఎమ్మెల్యే నాగిరెడ్డి తదితరులు

గాజువాక: నగరంలో ప్రతి వార్డులోను మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యతనిచ్చి అభివృద్ధి పనులు చేపడుతున్నామని జీవీఎంసీ మేయర్ గొలగాని హరివెంకట కుమారి అన్నారు. 71వ వార్డులోని వివిధ కాలనీల్లో రూ.3.68 లక్షలతో చేపట్టనున్న వివిధ పనులకు సోమవారం ఆమె శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతి వార్డులోను సీసీ రోడ్లు, బీటీ రోడ్లు, డ్రైనేజీలతోపాటు పార్కుల అభివృద్ధికి కూడా పెద్దపీట వేశామన్నారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి సూచనలతో విశాఖ మహా నగరాన్ని అత్యంత సుందర నగరంగా అభివృద్ధి చేస్తున్నామన్నారు. గాజువాక ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి మాట్లాడుతూ గాజువాక అభివృద్ధికి అటు ముఖ్యమంత్రి, ఇటు మేయర్ తమ పూర్తి సహకారం అందించారన్నారు. గాజువాకలో అనేక పెండింగ్ సమస్యలను ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి పరిష్కరించారన్నారు. నియోజకవర్గంలో ప్రతి వార్డులోను కోట్లాది రూపాయలతో అభివృద్ధి పనులకు మేయర్ సహకరించారన్నారు. వైఎస్సార్‌సీపీ గాజువాక సమన్వయకర్త ఉరుకూటి చందు మాట్లాడుతూ అటు అభివృద్ధిని, ఇటు సంక్షేమాన్ని ఇదే విధంగా కొనసాగించడం కోసం జగన్‌మోహన్‌రెడ్డిని ముఖ్యమంత్రిగా మరోసారి ఆశీర్వదించాలన్నారు. వార్డు కార్పొరేటర్ రాజాన రామారావు మాట్లాడుతూ తోకాడ పార్కు నుంచి శ్మశానం వరకు రూ.96.86 లక్షలతో సీసీ డ్రైనేజీ, శ్మశానం నుంచి ఎల్వీ నగర్ వరకు రూ.74.80 లక్షలతో సీసీ డ్రైనేజీ, కుంచుమాంబ కాలనీ దుర్గాదేవి ఆలయం నుంచి హనుమాన్ ఆలయం వరకు రూ.1.67కోట్లతో డ్రైనేజీ, సీసీ మెయిన్ రోడ్, కుంచుమాంబ కాలనీలో రూ.29.67లక్షలతో కల్వర్టును నిర్మించనున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు గోవింద్, ప్రసాద్, రామరాజు, కిశోర్, వీరబాబు, కృష్ణంరాజు, దేముడు, ఆచారి, బంక్ ప్రసాద్, శేషు, పైడిరాజు, వెంకటేష్, ఆర్టీసీ రాజు, రామరాజు, బొండా సూరిబాబు, సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు పాల్గొన్నారు.

శరవేగంగా బీసీ రోడ్డు నిర్మాణ పనులు


రోడ్డు నిర్మిస్తున్న దృశ్యం

పెదగంట్యాడ: బీసీ రోడ్డు నిర్మాణ పనులు శరవేగంగా సాగుతున్నాయి. జీవీఎంసీ 64, 65, 66, 74, 75 వార్డులను అనుసంధానం చేసే బాలచెరువు రోడ్డు (బీసీ రోడ్డు) కాకతీయ ఐటీఐ కూడలి నుంచి గంగవరం పోర్టు వంతెన వరకూ బీటీ రోడ్డు నిర్మాణానికి రూ.199.92 కోట్లు కేటాయించారు. అందులో భాగంగా గత నెల 31న ఈ పనులకు నగర మేయర్ గొలగాని హరి వెంకటకుమారి, గాజువాక ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి ప్రారంభించారు. అటు స్టీల్‌ప్లాంట్, ఇటు గంగవరం పోర్టుతో పాటు ఆటోనగర్‌లోని పలు పరిశ్రమల్లో పని చేసే వేలాది మంది ఈ రోడ్డు గుండా రాకపోకలు సాగిస్తుంటారు. అలాగే పెదగంట్యాడ నుంచి గాజువాక వెళ్లేందుకు కూడా ఇదే ప్రధాన రహదారి కావడంతో ఈ పనులను చకచకా పూర్తి చేసి వినియోగంలోకి తీసుకురానున్నారు.

ఎమ్మెల్యే నాగిరెడ్డి కృషితో..

ఈ రోడ్డును స్టీల్‌ప్లాంట్ అధికారులు పట్టించుకోకపోవడంతో గాజువాక ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి స్పందించారు. జీవీఎంసీ కమిషనర్ సీఎం సాయికాంత్ వర్మకు పరిస్థితిని వివరించారు. వెంటనే కమిషనర్ ఈ రోడ్డును పరిశీలించారు. దీని కోసం ప్రతిపాదనలు సిద్ధం చేయించారు. మొత్తం రోడ్డంతా గతుకులమయం కావడంతో వెంటనే కొత్తగా రోడ్డు నిర్మించేందుకు రూ.2 కోట్లు మంజూరు చేశారు. ఆ పనులను వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి తిప్పల దేవన్ రెడ్డి పరిశీలించారు.

కళింగవీధిలో బోరు ఏర్పాటు


కళింగవీధిలో ఏర్పాటు చేస్తున్న నూతన బోరు

కూర్మన్నపాలెం: జీవీఎంసీ 87వ వార్డు పరిధి కళింగ వీధి పార్కులో గాజువాక ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి ఆదేశాల మేరకు సోమవారం జీవీఎంసీ నిధులతో నూతన బోరు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి మండలాధ్యక్షులు బొడ్డ గోవింద్ ముఖ్య అతిథిగా పాల్గొని పూజలు చేసి బోరు ఏర్పాటు పనులను పూర్తి చేశారు. పార్కులో ప్రజల నీటి అవసరార్థం ఎమ్మెల్యే నాగిరెడ్డికి విన్నవించగా వెంటనే స్పందించిన ఆయన నిధులను సమకూర్చి బోరును ఏర్పాటు చేశారన్నారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి ప్రగడ వేణుబాబు, చముద్దపు దామోదర్, ప్రగడ శ్రీను, దుగ్గపు దానప్పలు, బడగల రాము, బద్ధ ధనుంజయ, పాల్గొన్నారు.

శ్రీవారికి పుష్పయాగం


ఊంజల్ సేవలో ఆలయ ధర్మకర్త తిప్పల రమణారెడ్డి, అన్నపూర్ణ దంపతులు

పెదగంట్యాడ: జీవీఎంసీ 74వ వార్డు పరిధిలోని దయాల్‌నగర్‌లోని వెంకటాద్రిపై వేంచేసియున్న శ్రీదేవి భూదేవి సమేత కల్యాణ వేంకటేస్వార స్వామి వారి ఆలయంలో ఈ నెల 19 నుంచి నిర్వహిస్తున్న వార్షిక బ్రహ్మోత్సవాలు సోమవారంతో ముగిశాయి. ఈ నెల 19న పంచాహ్నికదీక్షతో ఉత్సవాలకు శ్రీకారం చుట్టారు. ఆలయ ధర్మకర్త తిప్పల రమణారెడ్డి, అన్నపూర్ణ దంపతుల ఆధ్వర్యంలో ప్రతి రోజూ స్వామి వారికి ఆరాధన, నిత్య హోమాలు నిర్వహించారు. ఈ నెల 20న స్వామి వారి 18వ తిరు కల్యాణ మహోత్సవాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఆ రోజు పెద్ద ఎత్తున అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఉత్సవాల్లో భాగంగా శ్రీదేవి భూదేవి సమేత కల్యాణ వేంకటేస్వార స్వామి వారిని సోమవారం ప్రత్యేకంగా అలంకరించారు. పుష్పయాగం, ఊంజల్‌సేవ చేశారు. ఆయా కార్యక్రమాల్లో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామి వారి సేవలో తరించారు.

ఉచిత వంట గ్యాస్ కనెక్షన్ల పంపిణీ


మహిళలకు ఉచిత వంట గ్యాస్ సిలెండర్లను పంపిణీ చేస్తున్న కరణంరెడ్డి నర్సింగరావు

పెదగంట్యాడ: దేశ ప్రధాని నరేంద్ర మోదీ ప్రవేశపెట్టిన ఉజ్వల పథకం ద్వారా వంట గ్యాస్ లేని నిరుపేదలకు ఉచితంగా గ్యాస్ కనెక్షన్లను అందజేస్తున్నామని బీజేపీ గాజువాక నియోజకవర్గ కన్వీనర్ కరణంరెడ్డి నర్సింగరావు అన్నారు. జీవీఎంసీ 76వ వార్డు పరిధిలోని నడుపూరు గ్రామానికి చెందిన 25 మంది మహిళలకు మంజూరైన గ్యాస్ కనెక్షన్లను సోమవారం ఆయన పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జిలకర్ర భువనేశ్వరి, బొండా యల్లాజీరావు, కట్టా పద్మ, ప్రకాష్, శశిధరన్ పిల్లై, సీయాద్రి అప్పలరాజు, రవికుమార్, అనిత పాల్గొన్నారు.

45వేల దొంగ ఓట్లతో వెలగపూడి గెలిచారు

ఆరిలోవ: తూర్పు నియోజకవర్గం అసెంబ్లీ టికెట్‌ను అన్ని రాజకీయ పార్టీలు యాదవులకే కేటాయించాలని ఆ సామాజిక వర్గ నాయకులు డిమాండ్ చేశారు. తోటగరువు రాధాకృష్ణ కల్యాణ మండపంలో సోమవారం యాదవ సామాజికవర్గ నాయకులు ఒమ్మి చిన్నారావు, కె.బాబ్జీ, ఎల్లాజీ, భాగ్యానంద విలేకరులతో మాట్లాడారు. నియోజకవర్గంలో ఎక్కువ మంది యాదవ సామాజిక వర్గ ప్రజలు ఉన్నారన్నారు. అందుకే యాదవులకే అన్ని రాజకీయ పార్టీలు టికెట్ కేటాయించాలన్నారు. ప్రస్తుతం ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు 45 వేల దొంగ ఓట్లు గెలిచారని ఆరోపించారు. లేదంటే 2014లో యాదవ సామాజిక వర్గానికి చెందిన వంశీకృష్ణ శ్రీనివాస్, 2019లో అక్కమాని విజయనిర్మల గెలిచేవారని తెలిపారు.

అభివృద్ధి చెందిన భారతావని యువతతోనే సాధ్యం


విద్యార్థులకు సర్టిఫికెట్లు ప్రదానం చేస్తున్న ఎంపీ జీవీఎల్, రిజిస్ట్రార్ జేమ్స్ స్టీఫెన్

ఏయూక్యాంపస్: భారతదేశం 2047 నాటికి అభివృద్ధి చెందిన దేశంగా అవతరించడంలో యువత పాత్ర కీలకమని ఎంపీ జీవీఎల్ నరసింహారావు అన్నారు. ఏయూ జాతీయ సేవా పథకం ఆధ్వర్యంలో సోమవారం టి.ఎల్.ఎన్ సభా మందిరంలో నిర్వహించిన యువ సంవాద్ సమావేశం ముగింపు కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. విజేతలు సర్టిఫికెట్లు ప్రదానం చేసి మాట్లాడారు. దేశం ప్రథమం అనే విధంగా యువత నడచుకోవాలన్నారు. రిజిస్ట్రార్ ఆచార్య ఎం.జేమ్స్ స్టీఫెన్ మాట్లాడుతూ నాక్ గ్రేడింగ్‌లో ఏయూ అత్యుత్తమ స్థానం సాధించడంలో ఎన్ఎస్ఎస్ కార్యక్రమాలు, సేవలు ఉపయోగపడ్డాయన్నారు. ఉదయం జరిగిన ప్రారంభోత్సవంలో మాజీ ఎమ్మెల్సీ మాధవ్ మాట్లాడుతూ యువత దేశం కోసం కలలు కనాలని, వాటిని సాకారం చేసే దిశగా పనిచేయాలన్నారు. బీజేపీ రాష్ట్ర కార్యదర్శి సురేంద్ర మోహన్ మాట్లాడుతూ ప్రధాని మోదీ సూచించిన పంచ్‌ప్రాణ్ సూత్రాలను అంతా పాటిస్తూ వికసిత్ భారత్‌ను ఆవిష్కరించాలన్నారు. ఏయూ సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య కె.శ్రీనివాసరావు మాట్లాడుతూ పౌరులు బాధ్యతాయుత ప్రవర్తన కలిగి ఉండాలన్నారు. కార్యక్రమంలో భాగంగా వర్సిటీ స్థాయిలో పంచ్ ప్రాణ్‌పై నిర్వహించిన వక్తృత్వ పోటీల్లో 30 మంది యువతీ యువకులు పాల్గొని తమ భావాలను, ఆలోచనలను పంచుకున్నారు. వక్తృత్వ పోటీలకు న్యాయనిర్ణేతలుగా వ్యవహరించిన డాక్టర్ పి.ఉమామహేశ్వరరావు, ఇ.పి.ఎస్ భాగ్యలక్ష్మి, వై.అనసూయ దేవిలను సత్కరించారు.

ప్రజా రవాణాతో పర్యావరణానికి మేలు


ఆర్టీసీ బస్సులో కార్యాలయానికి చేరుకుంటున్న మేయర్ హరివెంకటకుమారి


కార్యాలయానికి సైకిల్‌పై వస్తున్న జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ

డాబాగార్డెన్స్: వారంలో ఒక్కరోజు ప్రజా రవాణా వినియోగించడం ద్వారా నగర కాలుష్యాన్ని అరికట్టవచ్చని మేయర్ గొలగాని హరివెంకటకుమారి అన్నారు. సోమవారం ఆమె తన క్యాంప్ ఆఫీస్ నుంచి జీవీఎంసీ కార్యాలయానికి ఏపీఎస్ ఆర్టీసీ బస్సులో చేరుకోగా.. జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ తన బంగ్లా నుంచి సైకిల్‌పై కార్యాలయానికి చేరుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నగరంలో కాలుష్య నియంత్రణకు వారంలో ఒక రోజు జీవీఎంసీ ఉద్యోగులతో పాటు అందరూ ప్రజా రవాణాను వినియోగిస్తున్నామని తెలిపారు. ఎకో–వైజాగ్ అభివృద్ధి నేపథ్యంలో ఎకో జీరో పొల్యూషన్ కార్యక్రమంలో భాగంగా నగరంలో పర్యావరణ పరిరక్షణకు, కాలుష్య నియంత్రణకు జీవీఎంసీ అనేక అవగాహన చర్యలు చేపడుతోందన్నారు. కాలుష్య నియంత్రణకు ప్రభుత్వ, ప్రైవేట్ కార్యాలయాలు, కళాశాలల యాజమాన్యం, పరిశ్రమల యాజమాన్యాలు, స్వచ్ఛంద సంస్థలు, నగర ప్రజలు సహకరించాలని కోరారు.

ఒత్తిడి వదిలేస్తే విజయం


పరీక్ష మెటీరియల్‌ను పంపిణీ చేస్తున్న సురేష్‌కుమార్

కూర్మన్నపాలెం: విద్యార్థులు ఏకాగ్రతతో చదివి నిగ్రహంతో పరీక్షలు రాస్తే విజయం తథ్యమని శిష్టకరణాల యువత రాష్ట్ర అధ్యక్షుడు మానాపురం సురేష్‌కుమార్ అన్నారు. ఈ మేరకు కూర్మన్నపాలెం శిష్టకరణాల అసోసియేషన్ కార్యాయలంలో పరీక్షలు రాసే పదో తరగతి, ఇంటర్ విద్యార్థులకు పరీక్ష మెటీరియల్‌ను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జీవితంలో లక్ష్యం గుర్తు చేసుకుని ఒత్తిడి గురికాకుండా పరీక్షలు రాయాలని పిలుపునిచ్చారు. ఉక్కు రిటైర్డ్ ఉద్యోగి ఎం.సత్యనారాయణ మాట్లాడుతూ చిన్నతనం నుంచే విద్యార్థులు తమ లక్ష్యంపై దృష్టి పెట్టాలన్నారు. కార్యక్రమంలో కూర్మన్నపాలెం శాఖ కార్యదర్శి డి.సత్యారావు, అధ్యక్షులు పీఎస్‌వీఎస్ గోపాల్, కోశాధికారి గురునాథం, యువత రాష్ట్ర కార్యదర్శి రవికాంతం, ఉపాధ్యక్షుడు నరసింగరావు, ఎస్.వరలక్ష్మి, కె.రవీంద్ర, వీవీఎస్.మూర్తి, కె.రామచంద్రరరావు, టీ.ప్రసాద్, ఎస్.శంకర్, బీఎస్ఎన్ పాత్రుడు, జీవీఎన్ మౌళి, జె.రమేష్, డి.ప్రసాదరావు తదితరులు పాల్గొన్నారు.